## చిన్నకథ



# చాక్లెట్

-బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు

శ్రీనివాస కలుపుగోలు మనిషి... మృదు భాషి.

అతని తీరు నన్నాకట్టుకొని, నన్నిట్టే అతని వేపు ఆకర్షింపచేసింది.

అతనితో పరిచయం నాకు గొప్పగా ఉంది. అందుకే ముసురైనా 'సరే' అన్నాను అతని మాటకి లేచి, తయారై. అతని రాకకై ఎదురు చూస్తున్నాను.

''ఏమిటండీ, ఆ ఫోన్ వచ్చింది లగాయితూ తెగ హడావిడి పడిపోతున్నారు?'' అడిగింది నా భార్య లక్ష్మి.

''మరే, నా కొలీగ్ శ్రీనివాస వస్తున్నాడు. అతను ఊరు పొలిమేరన ఉన్న వృద్ధాశ్రమాన్ని సందర్శిస్తాడట ఈరోజు. నన్నూ రమ్మన్నాడు. అతనిని మన కారులో అక్కడకు తీసుకు వెళ్లబోతున్నాను నేను.'' చెప్పాను గొప్పగా.

''ఇప్పుడా? మీరా ! దూరాన్న మబ్బు ఛాయ కనపడితేనే చాలు, కారు తీయరు ! అట్టిది ఈ ముసురులో, ఈ చిత్తడిలో, మరీ అంత దూరానికి కారు పాడుకాదా'' అంది లక్ష్మి బుగ్గలు నొక్కుకుంటూ.

''మరే, అతని మాట కొట్టడం భావ్యం కాదే''

''ఏమో !''

''అతను మంచివాడే, కాదు కాదు దొడ్డవాడే. మరే, అతని తీరు అమోఘం.'' అన్నాను.

''ట్రాన్స్‌ఫర్‌తో వచ్చి పట్టుమని పదిహేను రోజులు కాలేదు, ఇంతలోనే అతని గురించి అంతగా వల్లిస్తున్నారు! ఏమిటో అతనిలోని అంత ప్రత్యేకత.'' -అంది లక్ష్మి.

''మరే, అన్నం ఉడికిందో లేదో తెలుసుకోడానికి ఒక్క మెతుకు పట్టి చూస్తే చాలుగా, ఇది నీకు తెలీందా'' -అన్నాను నేను.

''ఇవి కుక్కర్ రోజుల్లెండి''. అంది లక్ష్మి చిత్రంగా.

అప్పుడే కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీశాను. శ్రీనివాస వచ్చాడు.

''తయారయ్యారా, టిఫిన్, కాఫీలయ్యాయా.'' అంటూ లోనికి వచ్చి, సోఫాలో కూర్చున్నాడు.

లక్ష్మిని అతనికి పరిచయం చేశాను.

''మాకు టిఫిన్, కాఫీ లివ్వు,'' చెప్పాను లక్ష్మికి.

''కాస్త వేడివేడివి పెట్టమ్మా. వాతావరణం చల్లగా ఉంది.'' అన్నాడు శ్రీనివాస చొరవగా, లక్ష్మితో.

చిన్నగా నవ్వుతూ, లక్ష్మి వంటగదిలోకి నడిచింది.

''భుజమంతా అలా తడిసిందేమిటి?'' అడిగాను శ్రీనివాసను.

''ఏదీ మా పక్కింటాయన రైతు బజారుకంటూ వస్తూ నన్నిక్కడ వదిలిపోయాడు. గొడుగులో రెండు భారీ శరీరాలు పట్టడం కష్టమే. నా కంటే ఆయన బాగా తడిచాడు'' అన్నాడు శ్రీనివాస నవ్వుతూ.

టిఫిన్, కాఫీలు వచ్చాయి.

అవి ముగించి, కారు తీసి, శ్రీనివాసతో బయలుదేరాను.

''మీ ఆవిడది రుచికరమైన చేయి'' అన్నాడు శ్రీనివాస, సర్దుక్కూర్చుంటూ.

కారు ముందుకు సాగిపోతోంది.

కొంత దూరం వచ్చాక, ''పళ్ళు కొంటాను'' అన్నాను.

''ఎందుకు ?'' -అన్నాడు శ్రీనివాస.

''మరే, మరి మీరేనా మీ నాన్నగారి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు పళ్ళు పంచేది!! పళ్ళుకొని నేనూ పంచుతాను'' అన్నాను.

''చాల్లెండి. మా నాన్న పుట్టిన రోజున, ఆయన నుంచే చాక్లెట్ తీసుకొని, ఆయన దీవెన తీసుకోవడం గత నాలుగేళ్ళగా అలవాటు నాకు!!

ఏదో ఆయన తృప్తి కోసం!.. అంతే'' అన్నాడు -శ్రీనివాస. కారును సడన్ బ్రేక్‌తో ఆపాను.

''మీ నాన్నగారు మీతో లేరా?'' అడిగాను ఆయోమయంగా.

''లేరు, ఆ వృద్ధాశ్రమంలోనే చేర్పించానుగా'' చెప్పాడు శ్రీనివాస మామూలుగా.

నా మనసు వికలమైంది. వెను తిరగాలనిపించింది.

వెంటనే కారును వెనుకకు తిప్పాను.

*